పశువులకు టీకాలే శ్రీరామరక్ష

- పొంచి ఉన్న గాలికుంటు వ్యాధి ముప్పు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్

ఎచ్చెర్ల :

వాతావరణ మార్పుల నేపథ్యంలో పశువులు గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉంది. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా పశువులు మృత్యువాత పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం ఎచ్చెర్ల నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పశు వైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవాలు కాపాడుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

ట్యాగ్ ఆధారంగా టీకాలు

నియోజకవర్గం పరిధిలోని పశువైద్య సిబ్బంది గతేడాది పశువులకు ట్యాగ్‌లు వేశారు. వాటి ఆధారంగా పశువులను గుర్తించి టీకాలు వేస్తున్నారు. ఇప్పటి వరకు ట్యాగ్ వేయించకపోతే వెంటనే ట్యాగ్ వేయించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 1414 గేదెలు, 55,047 ఆవులు ఉన్నాయి. రైతు భరోసా కేంద్రం, పశువైద్య కేంద్రాల పరిధిలో 87 శాతం జీవాలకు టీకాలు వేశారు. ఈ నెలాఖరు వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు.



లావేరు మండలంలో పాడి ఆవులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది



గాలికుంటు వ్యాధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల నియోజకవర్గంలో..

మండలం	పశువులు	టీకాలు వేస్తున్న సిబ్బంది
ఎచ్చెర్ల	16,920	32 మంది
జి.సిగడాం	13,340	18 మంది
లావేరు	12,732	21 మంది
రణస్థలం	13,469	20 మంది

వ్యాధి లక్షణాలు

- తొలుత పశువు నోటి నుంచి చొంగ కారడం ప్రారంభమవుతుంది.
- ఈ సమయంలో పక్కవాటికి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి సోకిన వాటికి 105 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది.
- నోట్లో, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడుతాయి.
- నెల రోజుల వయసున్న దూడలు ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే వ్యాధి సోకి మరణించే అవకాశం ఉంది.
- వ్యాధి సోకిన పశువులు ఎండలో ఎక్కువ సేపు ఉండలేవు.

నివారణ ఇలా..

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి గుంపు నుంచి వేరుచేసి విడిగా కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తరువాత పెన్సిలిన్, యాంటీ ఇస్టమిన్, యాంటీ ఇస్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, గాలి గిట్టల మధ్య గ్లిజరిన్‌తో శుభ్రం చేయసి బోరిక్ పౌడర్ పట్టించాలి.

వ్యాక్సిన్ తప్పనిసరి..



పశువులకు గాలికుంటు వ్యాధి సోకకముందే వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. లేకపోతే పశువులు చనిపోతాయి.

– వి.రమణ, ఎచ్చెర్ల పశువైద్యాధికారి

స్వచ్ఛ సంకల్పాన్ని విజయవంతం చేయాలి

లావేరు: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ అన్నారు. లావేరులో శుక్రవారం రణస్థలం, ఎచ్చెర్ల మండలాల సర్పంచ్‌లుకు, పంచాయతీ కార్యదర్శులకు స్వచ్ఛ సంకల్పంపై శిక్షణ ఇచ్చారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. సమావేశంలో జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, ఈవోపీఆర్‌డీ వి.విశ్వేశ్వరరావు, సర్పంచ్ ఉర్లాపు లక్ష్మీ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌కుమార్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

శ్రీకాకుళం రూరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ రోడ్డులోని కొత్తపేటలో రామ మందిరం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లా శ్రీనివాస్, జోగినాయుడు, వాసు, గణపతి పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు ఎంపిక

జి.సిగడాం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) టాలెంట్ పరీక్షలో జి.సిగడాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పేరేపు ఉదయ్, ముదిల దివ్యశ్రీ ఎంపికైనట్లు హెచ్ఎం పి.వి.నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం వీరిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుప్పిలి రవి కుమార్ పట్నాయక్ , తారకేశ్వరావు, రమేష్, దేవి, ఈశ్వరరావు, చంద్రశేఖర్, అర్జున్, జానకి, వెంకటేష్, భాస్కరరావు, కాశినాయుడు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరవలస ఏఎన్ఎంకు అవార్డు

జి.సిగడాం: బాతువ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని దేవరవలస సెక్టార్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న పి.కృష్ణవేణి ఉత్తమ ఏఎన్ఎం అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసినందుకుగాను శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా పొందూరులో నిర్వహించిన అవగాహన సదస్సులో బాతువ వైద్యాధికారి అనూష, పొందూరు వైద్యులు శర్మ, రమేష్‌నాయుడులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అభినందించారు.



కృష్ణవేణికి అవార్డు అందిస్తున్న వైద్యులు

పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీలు



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: పూర్తిస్థాయి పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలపే తీర్చిదిద్దుతున్నట్లు ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి తెలిపారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో శుక్రవారం పోషణ పఖ్వాడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికల్లో రక్త హీనత సమస్య ఉండకూడదని చెప్పారు. మందులు వినియోగం అవసరం లేకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్త హీనతను అధిగమించవచ్చన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, మాంసాహారం, గుడ్లు, ఆకు కూరలు, తృణధాన్యాలు, చిరు ధాన్యాలు ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి భాస్కరరావు, ఎంపీటీసీ సూర జగదీశ్వరరావు, సీడీపీఓ డి.పాపిపాయుడు, సూపర్‌వైజర్లు పైడి యశోద, అరుణకుమారి, టి.సావిత్రి, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

నేడు నిద్దాంలో గడపగడపకు మన ప్రభుత్వం

జి.సిగడాం: నిద్దాం గ్రామ సచివాలయం పరిధిలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

‘కించపరిచే వ్యాఖ్యలు మానుకోవాలి’

శ్రీకాకుళం న్యూకాలనీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధి ఇకనైనా కించపరిచే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అట్టాడ రాజేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిమ్న కులాలును కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకు గాను రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.

రెండు కార్లు ఢీ

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రెండు కార్లు ఢీకొట్టుకున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. నలుగురు వైద్యులతో కలిసి అనకాపల్లి నుంచి శ్రీకాకుళం రిమ్స్ వైపు వస్తున్న కారును ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఒడిశాకు చెందిన కారు(ఓడీ 02 ఏఎస్ 2977) వెనక నుంచి రెండు సార్లు ఢీకొట్టింది. ఈ ఘటనలో వైద్యుల కారు వెనుక భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు వెళ్లి పరిశీలించారు. ఢీకొట్టిన డ్రైవర్‌కు లైసెన్స్, వాహన డాక్యుమెంట్లు లేకపోవడం గుర్తించారు. డ్రైవర్ శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హుస్సేనీ మసీదులో ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో హుస్సేనీ మసీద్ వద్ద శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు నిర్వాహకులు ఎంఏ.రఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని నాగావళి తీరంలో ఉన్న లలితా త్రిపుర కాలభైరవస్వామి పీఠం దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం చేశారు.

సంతోషిమాతకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం

లావేరు: బాలల సమస్యలు, చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఎస్ఐ ఎల్.వెంకటరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ అన్నారు. కొత్తకోట పంచాయతీలో శుక్రవారం వైసీబీ ఆధ్వర్యంలో అమలవుతున్న చైల్డ్‌లైన్ కోలాబ్ ప్రాజెక్టు నేతృత్వంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మికుల నిరోధక చట్టం, లైంగిక వేధింపులు, బాలల హక్కులు, చట్టాలను వివరించారు. బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే టోల్ ఫ్రీ నంబరు 1098కు గానీ, 100కు గానీ ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, ఉప సర్పంచ్ మేడబోయిన లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కో కన్వీనర్ సుంకరి రాహుల్, మాజీ ఎంపీటీసీ గుమ్మడి దుర్గారావు, నాయకులు మేడబోయిన శ్రీను, కందివలస సూరిబాబు, లుట్ట ఎల్లయ్య, వంగమూడి శ్రీరామ్మూర్తి, లింగాల రామప్పడు, లింగాల వెంకటరావు, ఏఎస్ఐలు డి.రమణమూర్తి, కె.భుజంగరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సుష్మిత, హెచ్ఎం విజయ్‌వెంకట్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎల్.మురళీ, వీఆర్ఓ రేణుకారాణి, ఎంఎస్‌కే రేవతి, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ పి.హేమలత, కౌన్సిలర్ యు.మెహర్వాని, సిబ్బంది డి.మౌనిక, వై.శంకరరావు, పి.సాయిలక్ష్మీ, బాలవికాస్ ప్రాజెక్టు సిబ్బంది ఆర్.కల్పన, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు బాలకృష్ణ

ఆధార్‌తో ఓటర్ జాబితాల అనుసంధానం

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ సచివాలయం యూనిట్‌గా ఓటర్ జాబితాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి మురళీకృష్ణ అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శత శాతం ఆధార్ సీడింగ్ పూర్తిచేస్తే పారదర్శక జాబితా సిద్ధమవుతుందన్నారు. నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,35,930 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. 88.95 శాతం ఆధార్ సీడింగ్ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ మురళీకృష్ణ, ఓటర్ల జాబితా పర్యవేక్షకులు రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి మురళీకృష్ణ

ఇంటర్ విద్యతో డిఫెన్స్‌లో ఉన్నత కొలువులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారత రక్షణ రంగంలో ఆఫీసర్ క్యాడర్ స్థాయిలో తెలుగు వారి శాతం తక్కువగా ఉందని.. సరైన అవగాహన లేకపోవడమే దీనికి కారణమని ఇండియన్ ఆర్మీకాలింగ్ డైరెక్టర్ బి.వి.రమణ అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూపీఎస్ఎస్సీ, ఎన్‌డీఏ ఆఫీసర్స్, టీఈఎస్, సీడీఎస్ ఆఫీసర్ల ఉద్యోగాలకు సంబంధించి ఈ ఏడాది టెన్త్, ప్లస్ 2తో డిఫెన్స్ కోర్సు ప్రారంభించినట్టు చెప్పారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఇండియన్‌ఆర్మీకాలింగ్.కామ్ వెబ్‌పోర్టల్‌లో రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు 6281284246, 8712704951 నంబర్లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ గోవిందరావు, సెకెండ్ ఇన్‌చార్జి సురేంద్ర, ఏఓ శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ బి.వి.రమణ, సంస్థ ప్రతినిధులు

క్షయవ్యాధి అరికడదాం

శ్రీకాకుళం: అప్రమత్తంగా ఉంటూ క్షయవ్యాధిని అరికడదామంటూ జెమ్స్ వైద్యులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని జెమ్స్ అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ అనూరాధ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ముందే గుర్తించాలన్నారు. క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడితే తగ్గుముఖం పడుతుందన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం మంచిదన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సిబ్బంది ఎంఎస్‌డబ్ల్యూఓలు రమణమూర్తి, సత్యనారాయణ, ఢిల్లీశ్వరరావు, విజయ, పద్మ, ఇన్‌చార్జి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

వ్యక్తిత్వ వికాస గ్రంథం రామాయణం

శ్రీకాకుళం కల్చరల్: రామాయణం వ్యక్తిత్వ వికాస గ్రంథమని, అందులోని 24 వేల శ్లోకాల్లో ఎన్నో వ్యక్తిత్వ నిర్మాణ సూత్రాలు ఉన్నాయని గాయత్రీ కళాశాల తెలుగు పండితుడు భమిడిపాడి గౌరీశంకర్ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో జరుగుతున్న రామ వసంతోత్సవాలలో భాగంగా ‘రామాయణంలో వ్యక్తిత్వ వికాస సూత్రాలు’ అనే అంశంపై ప్రసంగించారు. అహం, అధికారం, సంపదల కన్నా వ్యక్తిత్వమే గొప్ప అని రామాయణం చెబుతోందన్నారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, మోహనరావు, ఎం.శ్రీనివాసరావు, వి.కామేశ్వరరావు, నర్సింహమూర్తి, పి.బాబూరావు, వెంకటరావు, అనూరాధ, పి.వి.ఎస్ ప్రసాద్, లక్ష్మీ, తవుడు తదితరులు పాల్గొన్నారు.



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

విద్యార్థులకు మెటీరియల్ వితరణ



మెటీరియల్‌ను అందజేస్తున్న కనకరాజు

శ్రీకాకుళం: బలగ నగరపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నైరా కళాశాల రిటైర్డ్ ఆచార్యులు ఆరికతోట కనకరాజు పరీక్షల మెటీరియల్‌ను శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం ఎ.వి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం దూరం



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సూర శ్రీనివాసరావు

రణస్థలం/శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చునని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత లక్ష్యాల ను చేరుకోవాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం, లావేరు, రణస్థలం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులకు అట్ట, పెన్ను, పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం నుంచి బయటపడాలంటే విద్యకు మించిన సాధనం లేదన్నారు. శతశాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దంత వైద్య శిబిరం



దంతాలను పరీక్షిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో శుక్రవారం సంపత్ వినాయక రూప సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు బి.వి.వి.శ్రీనివాస్, పి.సంగీత, ఎస్.శిరీషలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఆర్.ఎస్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి. రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం వి.శామ్యూల్, పీఆర్వో కె.సుమన్, ఆస్పత్రి సిబ్బంది ఎస్.పి.నాయుడు, టి.లలిత, పి.ఆదయ్య పాల్గొన్నారు.

విత్తన గుళికలతో సాగు మేలు



శిక్షణ ఇస్తున్న సిబ్బంది

గార: విత్తన గుళికలతో సాగు చేయడం ద్వారా భూమికి మేలు కలుగుతుందని ఎంసీఆర్‌పీ గున్నమ్మ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పంచాయతీ అంబటివానిపేటలో అంబటి సుధీర్ పొలం వద్ద ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తన గుళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. వర్షాలు సకాలంలో కురవకపోయినా విత్తన గుళికల ద్వారా లాభం పొందవచ్చన్నారు. గుళికలను పొడి వాతావరణంలో జల్లుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

రామజోగిపేటలో శ్రీమద్రామాయణ సప్తాహం



పురాణ కాలక్షేపం నిర్వహిస్తున్న పండితులు

ఎచ్చెర్ల క్యాంపస్: రామజోగిపేటలోని రామ మందిరం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ సప్తాహ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. హిందూధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితామణి పర్యవేక్షించారు. హిందూ ధర్మ ప్రాధాన్యత, రామాయణం గొప్పతనం, పండగలు గొప్పతనాన్ని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకాలు



అభిషేకం చేస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకూర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కరశర్మ అమ్మవారికి అభిషేకాలు చేశారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.

వాహనాల వేలం రేపు

రణస్థలం: అక్రమ మద్యం తరలింపు కేసులో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను ఆదివారం వేలం వేయనున్నట్లు జి.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ ఒ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం

లావేరు: పెదకొత్తకోటలో రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. భక్తులు అధికంగా తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, కొత్తకోట సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, ఉప సర్పంచ్ మేడబోయిన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

రణస్థలం: ఉద్యోగుల ఉద్యమ నేపథ్యంలో వర్క్ టూ రూల్ పాటిస్తూ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే పని చేస్తున్నామని తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు రణస్థలం రెవెన్యూ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.